ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY

3

శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

సోమవారం 19 మే 2025

లాంఛనమేనా..?

చైర్‌పర్సన్, ఎంపీపీ పదవులు టీడీపీ ఖాతాలోకేనా?

- నేడు రెండు స్థానాలకు ఎన్నిక
- టీడీపీకి పూర్తి మెజార్టీ
- క్యాంపులో పలువురు కౌన్సిలర్లు



కదిరి మున్సిపల్ కార్యాలయం

కదిరి, మే 18(ఆంధ్రజ్యోతి): కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్, గాండ్లపెంట ఎంపీపీ ఎన్నికల్లో టీడీపీ విజయం దాదాపు ఖరారైనట్లేనని ప్రస్తుత పరిస్థితులను బట్టి తెలుస్తోంది. సోమవారం రెండు పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. రెండు టీడీపీ వశమయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్లు, ఎంపీపీ ఎన్నికకు కావలసిన పూర్తి మెజార్టీ టీడీపీకి ఉండడంతో ఎన్నిక లాంఛనమేనన్న చర్చ సాగుతోంది. అయినా.. పలువురు కౌన్సిలర్ల క్యాంపునకు వెళ్లినట్లు సమాచారం. కదిరి మున్సిపల్ కౌన్సిల్‌తో వైసీపీ ఖాళీ అయిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. నెలరోజులుగా ఉత్కంఠకు తెరలేపిన మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఎవరికి దక్కుతుందో సోమవారం తేలనుంది.

నేడు ఎన్నిక

కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్‌తోపాటు గాండ్లపెంట ఎంపీపీ స్థానానికి ఎన్నిక నిర్వహించనున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్లపై గతనెల 23న అవిశ్వాస తీర్మానం పెట్టారు. అవిశ్వాసమే గెలిచింది. దీంతో చైర్‌పర్సన్ నజీమున్నీషా, వైస్ చైర్మెన్ అంజుగుట్టి రాజశేఖర్‌రెడ్డి, కొమ్ము గంగాదేవి పదవులు కోల్పోయారు. వీరి స్థానాలను భర్తీ చేసేందుకు సోమవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించనున్నారు. గాండ్లపెంట ఎంపీపీ పదవికి జగన్మోహన్ రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నిక రెండుమార్లు వాయిదా పడింది. మూడోసారి సోమవారం నిర్వహించనున్నారు. ఎంపీపీ అభ్యర్థిగా టీడీపీ సోమశేఖర్‌రెడ్డిని ఇప్పటికే ప్రకటించింది.

టీడీపీకి పూర్తి మెజార్టీ

మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్లు, గాండ్లపెంట ఎంపీపీ ఎన్నికకు కావలసిన పూర్తి మెజార్టీ టీడీపీకి ఉంది. 36 మంది ఉండే కదిరి మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రస్తుతం టీడీపీ బలం 25. వైసీపీకి 11 మంది ఉన్నారు. మున్సిపల్ కౌన్సిల్‌లో కోరం 25 మంది కావలసి ఉండగా, 25 మందితోపాటు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే ఉన్నారు. ఎన్నికకు 25 మంది హాజరైతే సగానికంటే ఒకటి ఎక్కువ 13 మంది సభ్యులతో టీడీపీకి మెజార్టీ ఉంటుంది. చైర్మన్, వైస్‌చైర్మెన్ పదవులు మూడూ టీడీపీకే దక్కనున్నాయి. గాండ్లపెంట మండలంలో 7 ఎంపీటీసీ స్థానాలున్నాయి. కటారుపల్లి ఎంపీటీసీ గంగోజమ్మ ఇటీవల టీడీపీలో చేరడంతో టీడీపీ బలం నాలుగుకు పెరిగింది. ఎంపీపీకి అవసరమైన కోరం, మెజార్టీ టీడీపీకి ఉంది. దీంతో ఎంపీపీ పదవి టీడీపీకే దక్కడం ఖాయంగా కనిపిస్తోంది.

వైసీపీ సభ్యులు హాజరయ్యేరా?

మున్సిపల్ కౌన్సిల్‌లో వైసీపీకి ప్రస్తుతం 11 మంది మాత్రమే సభ్యులు మిగిలారు. ఎన్నికకు వారు హాజరవుతారా, లేరా అన్న చర్చ సాగుతోంది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మాణం రోజు వైసీపీ సభ్యులు గైర్హాజరయ్యారు. విప్ జారీ చేసినవారే సమావేశానికి రాకపోవడం గమనార్హం. నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్ ఎన్నికకయినా వస్తారా, లేదా అను సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గాండ్లపెంట ఎన్నికకు కూడా వస్తారా, గతంలో తరహాలోనే గైర్హాజరవుతారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. వారు వచ్చినా, రాకపోయినా, టీడీపీకున్న మెజార్టీని బట్టి నాలుగు పదవులను సొంతం చేసుకుంటామని ఆ పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.



పురంలో జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న కూటమి నాయకులు, కదిరిలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రజలు



కదిరి తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్



జయహో భారత్

పురం, కదిరిలో అట్టహాసంగా తిరంగా ర్యాలీలు

వేలాదిగా తరలి వచ్చిన జనం

నినాదాలతో మార్మోగిన వీధులు

హిందూపురం, మే 18(ఆంధ్రజ్యోతి): 'జయహో భారత్, భారత్‌మాతాకీ జై' నినాదాలతో హిందూపురం, కదిరి వీధులు మార్మోగాయి. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో రెండుచోట్లా కూటమి పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం తిరంగా ర్యాలీలు అట్టహాసంగా నిర్వహించారు. హిందూపురంలో సూగూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి జాతీయ జెండాలతో చిన్నమార్కెట్, పేట వీధి మీదుగా గాంధీ సర్కిల్‌కు ర్యాలీగా చేరుకున్నారు. అక్కడ వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అక్కడి నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీగా వచ్చారు. రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి పూలమాలలువేసి, నివాళులు అర్పించారు. 'జయహో భారత్.. భారత్ మాతాకీ జై, ఖబడ్దార్ పాకిస్థాన్' అంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదంపై భారత్ అద్భుత విజయం సాధించిందని వక్తలు పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో మురళీనాయక్ వంటి జవాన్లు అమరులయ్యారనీ, వారి కుటుంబాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, ఎమ్మెల్యే పీఏలు సురేంద్ర, వీరయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ అనిల్, కార్పొరేషన్ల డైరెక్టర్లు బేవనహళ్లి ఆనంద్, పరిమళ, జనసేన నేత ఉమేష్, బీజేపీ నాయకుడు పార్థసారథి పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తూ..

కదిరిలో..

కూటమి పార్టీ అధ్వర్యంలో తిరంగా ర్యాలీ కోలాహలంగా నిర్వహించారు. స్థానిక పీవీఆర్ ఫంక్షన్ హాల్ నుంచి తిరంగా ర్యాలీ ప్రారంభమైంది. నానాదర్గా, కూరగాయల మార్కెట్, ఇక్బాల్ రోడ్డు, చౌక్, శివాలయం, గొల్లమ్మ మండపం, హిందూపురం క్రాస్, టవర్‌క్లాక్, కాలేజీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, పూలే సర్కిల్ మీదుగా జీవిమాను సర్కిల్ వరకు కొనసాగింది. వీరజవాన్ మురళీనాయక్‌కు ఘనంగా నివాళి అర్పించారు. వందేమాతరం నినాదాలతో పట్టణ వీధులు మార్మోగాయి. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. భరతమాత ముద్దుబిడ్డ వీర జవాన్ మురళీనాయక్ అని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. పాకిస్థాన్ తీవ్రవాదులు పిరికిపందలన్నారు. వారిని భారత సైనికులు తరిమి తరిమి కొట్టారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్, పెద్దఎత్తున జనం పాల్గొన్నారు.

బడుగులకు రాజ్యాధికారం పంచింది ఎన్టీఆర్

- నాలుగు దశాబ్దాలు కార్యకర్తలదే విజయం
- యువతకు పార్టీ ఆవిర్భావం గురించి తెలియాలి
- మినీ మహానాడులో ఎంపీ బీకే



మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎంపీ బీకే పార్థసారథి

హిందూపురం, మే 18(ఆంధ్రజ్యోతి): బడుగులకు రాజ్యాధికారం పంచింది నందమూరి తారకరామారావు అని ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. స్థానిక జేవీఎస్ ప్యాలెస్‌లో ఆదివారం మినీ మహానాడు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ.. టీడీపీ నాలుగు దశాబ్దాలుగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని నిలబడిందంటే ఇందుకు కార్యకర్తలే కారణమన్నారు. పార్టీ ఇన్నిసార్లు అధికారంలోకి రావడానికి పునాది వారేనన్నారు. ఇది కార్యకర్తల విజయమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నిరంకుశ పాలనతో తల్లడిల్లుతున్న సమయంలో నందమూరి తారకరామారావు పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లో అధికారాన్ని చేపట్టారన్నారు. అప్పటి వరకు రాజకీయమంటే తెలియని ఎంతోమందిని నాయకులు, ప్రజాప్రతినిధులుగా చేశారన్నారు. బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాధికారం పంచింది దేశంలోనే తెలుగుదేశం పార్టీ అన్నారు. ఎంతో మంది చిరుద్యోగులు, రైతులను అసెంబ్లీకి పంపించిన ఘనత టీడీపీదేనన్నారు. పార్టీ ఆవిర్భవించి 40 ఏళ్లు దాటిందనీ, యువతరం వస్తోందనీ, వారంతా తెలుగుదేశం పార్టీ ఎందుకు ఆవిర్భవించింది, ఈ 40ఏళ్లలో పార్టీ ఎదుర్కొన్న ఆటుపోట్లను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏటా మినీ, మహానాడు జరుపుకోవడం తెలుగుదేశం పార్టీకి ఆనవాయితీగా వస్తోందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్తలను ఎమ్మెల్యే, స్పీకర్ చేసిన ఘనత దేశంలో టీడీపీకే దక్కుతుందన్నారు. రాజకీయ ఓనమాలు రాని వారిని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే, ఎంపీలుగా చేసిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్‌కుమార్, ఎమ్మెల్యే పీఏ సురేంద్ర, నేతలు నాగరాజు, పరిమళ, దేమకేతేపల్లి అంజినప్ప, ఆయా మండలాల కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.



హాజరైన నాయకులు, కార్యకర్తలు

ఎన్నెన్నో అందాలు!

- ముచ్చట గొలుపుతున్న వేమన రిజర్వాయర్
- బోటింగ్ ఏర్పాటు చేస్తే మరింత ఆహ్లాదకరం
- జలాశయం సమీపంలో లఘుచిత్రాల షూటింగ్
- ఇక్కడికొస్తే ప్రకృతి ప్రేమికులకు కనువిందే
- పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు

యోగివేమన జలాశయం మధ్యలో ద్వీపంలా భూభాగం



ముదిగుబ్బ, మే 18(ఆంధ్రజ్యోతి): చుట్టూ పచ్చని గుట్టలు, కొండలు, నిండుగా నీటితో యోగివేమన జలాశయం... మధ్యలో ద్వీపాన్ని తలపించేలా విశాలమైన భూభాగం. జలాశయంలో బోటింగ్ చేస్తూ ఆ భూభాగాన్ని చేరి కాసేపు గడపాలని ఆ ప్రకృతిని చూసిన పలువురు ఎంతగానో ఆశిస్తున్నారు. సమీపంలోని దొరిగల్లు అటవీ ప్రాంతం, జలాశయం దగ్గర కొందరు లఘుచిత్రాలను సైతం చిత్రీకరిస్తున్నారు. మనసుకి హాయి గొలిపేలా ప్రశాంత వాతావరణం ఉన్న ఈ ప్రాంతం పర్యాటకంగా మాత్రం వెనుకబడి ఉంది. ఎంతోమంది ప్రజాప్రతినిధులు మారుతున్నా పర్యాటకాభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదు. పర్యాటకానికి ఎంతో అనువైన ఈ ప్రాంతాన్ని సంబంధిత శాఖ అధికారులైనా చొరవ చూపి అభివృద్ధి చేయాల్సి ఉంది.

ద్వీపాన్ని తలపించేలా...

చుట్టూ నీరు, జలాశయం మధ్యలో సుమారు రెండు ఎకరాలకు పైగా భూభాగం విస్తరించి ఉండటంతో ఓ ద్వీపంలా కనిపిస్తుంది. పడవల్లో విహరించేందుకు ఈ జలాశయం ఎంతో అనువుగా ఉంది. వేసవిలోనూ నీటిమట్టం తగ్గకుండా 20 అడుగుల మేర నిల్వ చేయడంతో నిరంతరం కళకళలాడుతూ ఉంటుంది. సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాల్లో రమణీయ దృశ్యాలను కొందరు తమ సెల్‌ఫోన్‌లలో బంధిస్తుంటారు. రిజర్వాయర్ గేట్లు ఎత్తినప్పుడు, వారాంతపు సెలవు రోజుల్లో, పండగ సమయాల్లో పలువురు కుటుంబ సమేతంగా వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తుంటారు. జలాశయంలో బోటింగ్ ఏర్పాటు చేస్తే ఇక్కడికి పర్యాటకులు మరింత మంది పెరిగే అవకాశం ఉంది.

అన్ని వసతులున్నా...

జలాశయ పూర్తి నీటి సామర్థ్యం 1 టీఎంసీ. 70 అడుగుల లోతు, 500 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నీరు ఉంటుంది. 42వ జాతీయ రహదారికి సమీపంలో ఉండటంతో ఇక్కడ బోటింగ్ ఏర్పాటు చేస్తే సందర్శకులు మరింత పెరిగి పర్యాటక రంగానికి ఆదాయం కూడా వచ్చే అవకాశం ఉంది. జలాశయం చుట్టూ చెట్లు ఉండటంతో వేసవిలోనూ చల్లగానే ఉంటుంది. వసతులు ఏర్పాటు చేస్తే ఇక్కడకు ప్రతి రోజూ వచ్చే సందర్శకుల సంఖ్య పెరుగుతుంది.



యోగివేమన జలాశయం

బోటు షికారు ఏర్పాటు చేయాలి

యోగివేమన జలాశయంలో ద్వీపంలా భూభాగం కనిపిస్తుండటంతో బోటులో విహరిస్తే ఆహ్లాదకరంగా ఉంటుంది. చిన్నపిల్లలు సముద్రంలో విహరించిన అనుభూతిని పొందుతారు. సంబంధిత అధికారులు బోటు షికారు ఏర్పాటు చేయాలి.



-కృష్ణం మహేష్‌కుమార్, ముదిగుబ్బ

ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం

ముదిగుబ్బ యోగివేమన జలాశయం, బత్రేపల్లి, కదిరి పలు ప్రాంతాలలోని పర్యాటక ప్రదేశాలను పరిశీలించి, నివేదికను తయారు చేసి ఉన్నతాధికారుల దృష్టికి పంపాము. అక్కడి నుంచి ఆదేశాలు, నిధులు వస్తే పర్యాటకులకు అవసరమైన పనులు చేపడతాం.

- ప్రతాప్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా పర్యాటక మేనేజర్

వసతులు కల్పించాలి

యోగివేమన జలాశయ పరిసరాలలో ఎంతో అందమైన వాతావరణం ఉంటుంది. అంతే కాకుండా ముదిగుబ్బ చుట్టు ప్రక్కల ప్రాంతాలలో ఎటువంటి పర్యాటక ప్రదేశాలు లేవు. యోగివేమన జలాశయంలో బోటు విహారంతో పాటు వసతులు కల్పిస్తే బాగుంటుంది.



-కునుకుంట్ల ఆదినారాయణ, ముదిగుబ్బ

శాసనాలను పరిశీలించిన చరిత్రకారుడు



సజ్జగంట రంగనాథస్వామి ఆలయంలో శాసనాలను పరిశీలిస్తున్న మైనాస్వామి తదితరులు

సోమందేపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడిపల్లి సజ్జగంట రంగనాథస్వామి ఆలయాన్ని చరిత్రకారుడు మైనాస్వామి పరిశీలించారు. పలు శాసనాల గురించి ఆయన ఆలయ కమిటీ సభ్యులతో చర్చించా రు. 1299 సంవత్సరంలో గుడిపల్లిలోని సజ్జగంట రంగనాథస్వామి ఆలయాన్ని హోయసలల ప్రభువు మూడో వీరబల్లుడు నిర్మించి ఉండవచ్చని అన్నారు. శాసనం ఆధారంగా ఆలయ విశిష్టత, చరిత్రను అర్థం చేసుకోవచ్చన్నారు. విజయనగర సామ్రాజ్య తొలినాళ్లలో లిఖించిన శాసనం ఇక్కడ ఉందని తెలిపారు. చాలా వరకు శాసనాలు చదవడానికి వీలులేకుండా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో చరిత్ర పరిశోధకుడు గోపి, ఆలయ ధర్మకర్త రమాకాంత్‌రెడ్డి, రమేష్, శ్రీధర్, వెంకటరమణ, శ్రీనివాస్, శిరివేలు, ఉత్తప్ప, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల దృష్ట్యా జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న వా రంరోజుల్లో జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపిందన్నారు. వర్షంతోపాటు బలమైన పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. దూరప్రాంతాలకు ప్రయాణాలు రద్దుచేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితి ఎదురైతే లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లా రెవెన్యూ యంత్రాంగం 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీచేశారు. అత్యవసరమైతే కంట్రోల్ రూంనెంబరు 08555-289039ను సంప్రదించాలని సూచించారు.

దంచికొట్టిన వాన

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- రొద్దంమర్రిలో పిడుగుపాటుకు కూలిన షెడ్డు
- దెబ్బతిన్న పంటలు

(వివరాలు 4వ పేజీలో...)

తల్లికి వందనం వచ్చేస్తోంది!



ధర్మవరం, మే 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురు చూస్తున్న తల్లికి వందనంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తాజాగా మంత్రి వర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై చర్చించడం, పాఠశాలలు తెరిచిన వెంటనే అమలు చేస్తామని ప్రకటించడంతో ఆయా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వ పాలనలో అమ్మఒడి పేరుతో అమలు చేసిన పథకంలో కోతలు విధించారు. అప్పట్లో ఎన్నికలకు ముందు ఇద్దరు పిల్లలకు రూ.15వేలు ఇస్తామని ప్రకటించగా.. అధికారంలోకి వచ్చాక ఒక్కరికే పరిమితం చేశారు. ఇందులోనూ అనేక అంక్షలు పెట్టి కొన్ని వర్గాలకు ఇవ్వలేదు. మరుగుదొడ్ల నిర్వహణ పేరుతో రూ. 2వేల కోత విధించి.. రూ.13వేలే చెల్లించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు తల్లికివందనం పేరిట ఒక్కో విద్యార్థికి రూ.15వేల చొప్పున ఇస్తామన్నారు. ఈ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. తాజాగా మంత్రివర్గ సమావేశంలో జూన్‌లోనే అమలు చేయనున్నట్టు స్పష్టం చేశారు. ఓ కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ పథకం వర్తిస్తుందని ప్రకటించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 2,622 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1,48,096 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు 525 ఉండగా ఇందులో 95,840 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో దాదాపుగా వీరందరికీ రూ.15వేలు చొప్పున లబ్ధిచేకూరనుంది. అదే విధంగా జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఎయిడెడ్ కళాశాల, ఏపీఆర్‌జేసీ, సోషియల్ వెల్ఫేర్, ఎస్టీ వెల్ఫేర్ ఒక్కొక్కటి, బీసీ వెల్ఫేర్ 4, కేజీబీవీ 30 కళాశాలలు ఉన్నాయి. ఇందులో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆరు వేల మంది ఉన్నారు. ప్రైవేటు జూనియర్ కళాశాలలు 26 ఉండగా.. ఇందులో 6,500 మంది ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో దాదాపుగా వీరందరికీ రూ.15వేలు చొప్పున లబ్ధిచేకూరనుంది. నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు ఈ పథకం ద్వారా ఉపయోగపడనుంది.

పిల్లలందరికీ ఇవ్వడం సంతోషకరం

రాష్ట్ర ప్రభుత్వం తల్లికివందనం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా అందరికి ఒక్కొక్కరికి రూ.15వేలు ఇస్తామని ప్రకటించడం సంతోషకరం. వైసీపీ ప్రభుత్వ హయాంలో మొదట్లో ఇంట్లో పిల్లలు అందరికీ అని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక ఒక్కరికి అమ్మఒడి కింద రూ.15వేలు ఇచ్చారు. ఆ తరువాత పాఠశాల నిర్వహణ పేరుతో రూ.2వేలు కోత విధించి రూ.13వేలు మాత్రమే ఇచ్చారు.



-తులసి, విద్యార్థి తల్లి, ధర్మవరం

తల్లికి వందనం.. పేదలకు భరోసా



రాష్ట్ర ప్రభుత్వం వచ్చేనెలలో అందించే తల్లికి వందనం మాలాంటి పేదలకు భరోసా. నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కరికే అమ్మఒడి కింద రూ.13 వేలు మాత్రమే వచ్చేది. ఆ మొత్తం ముగ్గురికి ఏ మాత్రం సరిపోలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఇంట్లో ఉన్న పిల్లలందరికి తల్లికివందనం ఇస్తోంది. దీంతో మా పిల్లల చదువులకు ఆర్థిక సమస్య తీరనుంది.

- నాగూర్‌బీ, విద్యార్థి తల్లి, ముదిగుబ్బ

ఆదేశాలు రావాల్సి ఉంది..

తల్లికి వందనం పథకం గురించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అన్ని వివరాలతో నివేదిక అందజేస్తాం. విద్యార్థుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉన్నాయి.



- కిష్టప్ప, డీఈఓ

21న డీఈఓ కార్యాలయం ముట్టడి

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక

అనంతపురం విద్య, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు, ఇతర అంశాలపై ఈనెల 21న తలపెట్టిన డీఈఓ కార్యాలయ ముట్టడికి ఉపాధ్యాయులు తరలిరావాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఉపాధ్యాయభవన్‌లో వైఎస్ఆర్‌టీఏ జిల్లా నాయకుడు నాగిరెడ్డి, ఆప్టా నాయకుడు వెంకటరత్నం ఆధ్వర్యంలో సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాశాఖలో తీసుకుంటున్న నిర్ణయాల వల్ల గ్రామీణ విద్యావ్యవస్థ విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. గత ప్రభుత్వం ఆరు స్కూళ్లు తెస్తే..ఈ ప్రభుత్వం తొమ్మిది రకాల స్కూళ్లు తేవాలని చూస్తోందని, ఫలితంగా తీరని నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, లింగమయ్య, గోవిందరాజులు, రాయల్ వెంకటేష్, సిరాజుద్దీన్, జయరామిరెడ్డి, బాలమురళి, శ్రీధర్‌గౌడ్, రమణ, రవీంద్ర, హరికృష్ణ, రవీంద్ర, శివానందరెడ్డి, నరసింహారెడ్డి, ఓబులేసు, వెంకటేషులు, సుబ్బయ్య పాల్గొన్నారు.

బస్సులో తడిసి ముద్దయ్యారు..


ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

హిందూపురం, మే 18(ఆంధ్రజ్యోతి): హిందూపురం డిపోకి చెందిన ఆర్టీసీ బస్సులో ప్రయాణీకులు తడిసి ముద్దయ్యారు. శనివారం రాత్రి తిరుపతి నుంచి బస్సు బయల్దేరింది. మదనపల్లి వద్దకు వచ్చేసరికి వర్షం కురియడంతో పూర్తిగా తడిసిపోయారు. బస్సులో ఉన్న ప్రయాణీకుల లగేజీ, ల్యాప్‌ట్యాప్‌లు తడిసిపోయాయి. చిన్నారులు, వృద్ధులు ఇబ్బందిపడ్డారు. దీంతో బస్సు ఆపి గంటపాటు ప్రయాణీకులు ఆందోళన చేసినా ఎవరూ పట్టించుకోలేదు. బస్సుకు అద్దాలు లేకపోవడంతో వర్షపు నీరు లోపలికి చేరింది. ఎలాగోలా కదిరికి అదే బస్సులో చేరుకున్నారు. అక్కడ మరోసారి ప్రయాణీకులు ఆందోళనకు దిగారు. దీంతో ప్రత్యామ్నాయంగా మరో బస్సు ఏర్పాటుచేశారు. ప్రయాణీకులు హిందూపురం చేరుకున్నాకా బస్సు డిపో వద్ద తిరిగి ఆందోళన చేశారు. దూరప్రాంతాలకు వెళ్లే బస్సుకి అద్దాలు, టాప్ సరిగా లేకపోవడంతో ఇబ్బంది పడ్డామన్నారు. ప్రయాణీకుల బాధలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

స్వరా ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి కేశవ్


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం క్లాక్‌టవర్, మే 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మారుతీనగర్‌లో స్వరా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆదివారం ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా ప్రారంభించారు. నగరంలో ప్రజల అవసరాలకు అను గుణంగా అత్యాధునిక హంగులు, వసతులతో నూతన ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు చౌకగా మెరుగైన వైద్యసేవలు అందించి అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, డాక్టర్లు రాకేష్‌నాయక్, ఎండి నాయక్, ఎం శ్వేత పాల్గొన్నారు.


రొచ్చుమర్రిలో పిడుగుపాటుకు కూలిన రేకులషెడ్డు


తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు


వీరఓబునపల్లి వద్ద కొట్టుకుపోయిన వేరుశనగ మొలకలు

దంచికొట్టిన వాన


కల్లుదేవనహళ్లి వద్ద పత్తి పంటలో నిలిచిన నీరు

పొంగిపొర్లిన వాగులు, వంకలు
రొచ్చుమర్రిలో పిడుగుపాటుకు కూలిన షెడ్డు
దెబ్బతిన్న పంటలు


విడపనకల్లు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఆర్ కొట్టాల-గడేకల్లు వంక


ఛాయాపురం వద్ద కోతకు గురైన హంద్రీనీవా కాలువ గట్టు

అనంతపురం అర్బన్/విడపనకల్లు/బొమ్మనహాల్/కణేకల్లు/పెనుకొండ రూరల్/ఉరవకొండ/రాయదుర్గం, మే 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి వాన దంచికొట్టింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలుచోట్ల వాహన రాకపోకలు స్తంభించాయి. రెండుచోట్ల పిడుగులు పడ్డాయి. భారీ వర్షానికి పలు పంటలకు నష్టం వాటిల్లింది. ఈదురుగాలులతో కూడిన వర్షానికి గార్లదిన్నె మండలంలోని మర్తాడు, కొప్పలకొండ, కేశవాపురం గ్రామాల్లో 24 మంది రైతులకు సంబంధించి 12 హెక్టార్లల్లో రూ.7.4 లక్షల విలువైన వరి పంట దెబ్బతింది.

పొంగిన వాగులు, వంకలు...

విడపనకల్లు మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఆర్ కొట్టాల-గడేకల్లు మధ్య పెద్ద వంక ఉధృతంగా ప్రవహించటంతో విడపనకల్లు నుంచి గుంతకల్లుకు వాహన రాకపోకలు బంద్ అయ్యాయి. మధ్యాహ్నం వంక ఉధృతి తగ్గటంతో వాహనాల రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. ఉండబండ గ్రామసమీపంలోని వంక పొంగి బీసీ కాలనీలోని ఇళ్లలోకి నీరు చేరింది. కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాల్తూరు-గోవిందవాడ వంక, ఉండబండ-ఉరవకొండ వంక, పొలికి-అంచనహాలు వంకలు ఉధృతంగా ప్రవహించటంతో ఆయా ప్రాంతాల్లో మధ్యాహ్నం వరకూ రాకపోకలు నిలిచిపోయాయి.

● ఉరవకొండ మండలం పాల్తూరు వద్ద వంక పొంగిపొర్లడంతో ఉరవకొండ-హొన్నూరుకు ఉదయం 10 గంటల వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి. ఉరవకొండ పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీలోని గుడారాల్లోకి వర్షపు నీరుచేరడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఛాయాపురం వద్ద హంద్రీనీవా కాలువ గట్టు కోతకు గురైంది. కాలువలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది.

పత్తి రైతు గుండెల్లో గుబులు

రాయదుర్గం: పట్టణంలో వీధులు జలమయమయ్యాయి. దాసప్పవీధి, ప్యాలెస్‌రోడ్డుతోపాటు మధుటాకీస్ ప్రాంతాల్లో ఇళ్ల మధ్య నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు కారణంగా రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. సీతమ్మకుంట, ఒట్లకుంటలో నీరు చేరింది.

బొమ్మనహాళ్‌లో..

బొమ్మనహాళ్ మండలంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆదివారం ఉదయం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షం.. పత్తి రైతుల గుండెల్లో గుబులు రేపింది. పత్తి పంట చేతి కొచ్చిన సమయంలో వర్షం రావడంతో నీరు పత్తి పొలంలో చేరి చెట్లు వాడుముఖం పట్టి ఆకులు నేలవైపు వాలుతున్నాయి. దీంతో మొక్క కుళ్లిపోతోందని రైతులు వాపోతున్నారు. పత్తి కాయలు కూడా రాలిపోతాయని ఆందోలన చెందుతున్నారు. మొక్కజొన్న, వరి ధాన్యం తడిసిపోయాయని వారు ఆవేదన చెందుతున్నారు.

కూలిన షెడ్డు

కణేకల్లు మండలం రచ్చుమర్రి గ్రామం వద్ద పిడుగు పడింది. ఆ ధాటికి సమీపంలోని రేకుల షెడ్డు కూలిపోయింది. అందులోని గేదె, రెండు పోతులు మరణించాయి. మరో నాలుగు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి. దీంతో పాడి రైతు మొండేలు హనుమంతుకు రూ.2.50 లక్షల మేర నష్టం వాటిల్లింది. మండలంలోని నాగేపల్లి, కణేకల్లు తదితర గ్రామాల పరిధిలో నిలువ ఉంచిన ధాన్యం తడిసిపోయింది. సొల్లాపురం వద్ద వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు స్తంభించిపోయాయి.

కొట్టుకుపోయిన వేరుశనగ మొక్కలు

ఓబుళదేవరచెరువు: మండలంలో వర్షానికి వేరుశనగ, వరి పంటలకు నష్టం వాటిల్లింది. వీర ఓబునపల్లికి చెందిన చిన్నబాబు పొలంలో ఒక టిన్నర ఎకరాలో సాగుచేసిన వేరుశనగ మొలకెత్తిన దశలో ఉండగా.. వర్షానికి కొట్టుకుపోయిందనీ, రూ.పదివేలదాకా నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. బావాసాహెబ్‌పల్లి రైతులు కృష్ణమూర్తి, రామప్ప సాగుచేసిన వరి పంట గాలివానకు నేలకొరిగింది. పెనుకొండ మండలం మునిమడుగు గ్రామానికి చెందిన నరసింహప్ప ఇంటివద్ద పెంచుకున్న టెంకాయచెట్టుపై పిడుగు పడి దగ్ధమైంది.

అనంతలో భారీ వర్షం

అనంతపురంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. పలు కూడళ్లలో పెద్దఎత్తున నీరు చేరింది. శింగనమల, గార్లదిన్నె, డీ.హీరేహాళ్, కూడేరు, బుక్కరాయసముద్రం తదితర మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది.

వర్షపాతం నమోదు ఇలా..

గోరంట్లలో 96.2, విడపనకల్లు 95.4, ఉరవకొండ 89.2, వజ్రకరూరు 86.2, బెలుగుప్ప 75.4, అమడగూరు 74.8, బొమ్మనహాళ్ 67.4, బ్రహ్మసముద్రం 56.4, చెన్నేకొత్తపల్లి 55.4, గుంతకల్లు 52.6, గుమ్మఘట్ట 52.2, కణేకల్లు 46.8, పుట్టపర్తి 46.4, రాయదుర్గం 45.6, కొత్తచెరువు 42.6, కూడేరు 42.4, పెనుకొండ 41.4, కదిరి 38.6, గార్లదిన్నె 37.6, ముదిగుబ్బ 36.4, ఓబుళదేవరచెరువు 35.4, యల్లనూరు 34.6, తనకల్లు 32.2, శెట్టూరు 31.6, అనంతపురం 30.2, నల్లమాడ 28.2, డి.హిరేహాళ్ 27.2, గుడిబండ 26.8, నల్లచెరువు 26.2, సోమందేపల్లి 23.4, రామగిరి 23.2, హిందూపురం 22.6, పామిడి 22.4, బుక్కపట్నం 21.0, ఆత్మకూరు 20.0, తాడిపత్రి, కళ్యాణదుర్గం, గుత్తి 19.4, చిలమత్తూరు 18.2, నంబులపూలకుంట 18.0, రొద్దం 17.0, మడకశిర 16.6, రొళ్ల 15.4, లేపాక్షి 14.8, పరిగి 14.6, కుందుర్పి 13.4, గాండ్లపెంట 11.0, అమరాపురం 9.8, అగళి 7.4, కనగానపల్లి 4.2, తాడిమర్రి 3.4, ధర్మవరం, తలుపుల 2.4, బత్తలపల్లి 2.2 మి.మీ, వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

హసీనాబానుపై బదిలీ వేటు

అక్రమ వసూళ్లు, ఆఫీస్‌బాయ్‌పై చెప్పుతో దాడి ప్రభావం
వివాదాస్పద కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐపై విచారణ
ఎక్సైజ్ కమిషనర్‌కు నివేదిక
ఒకటి, రెండు రోజుల్లో సస్పెన్షన్ ఉత్తర్వులు..?
సీఐ వ్యవహారంపై కలెక్టర్, ఎస్పీ సీరియస్


ఎక్సైజ్ సీఐ హసీనాబాను

అనంతపురం అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): అక్రమ వసూళ్ల ఆరోపణలు, ఆఫీస్ బాయ్‌పై చెప్పుతోదాడి ఘటన నేపథ్యంలో కళ్యాణదుర్గం సీఐ హసీనాబానుపై బదిలీవేటు పడింది. కళ్యాణదుర్గం ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో కర్ణాటక అక్రమ మద్యం సరఫరాను అరికట్టాల్సిన సదరు సీఐ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కర్ణాటక అక్రమ మద్యం, టెట్రాప్యాకెట్లు దొరికితే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందిపోయి.. ఆఫీస్ బాయ్ ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇదే క్రమంలో అక్రమ మద్యం విక్రయిస్తున్న వారి నుంచి డబ్బులు వసూలు చేసుకొని రావాలని ఆఫీస్ బాయ్ నానిపై ఒత్తిడి పెంచినట్లు సమాచారం. ఆ ఒత్తిడి భరించలేని ఆఫీస్‌బాయ్ ఎక్సైజ్ ఉద్యోగుల సంఘం నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం సంఘం నాయకులు కళ్యాణదుర్గం ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి, ఆఫీస్ బాయ్ ఫిర్యాదుపై సీఐని ప్రశ్నించారు. ఈ సమయంలో తన పేరు చెప్పి డబ్బులు వసూలు చేసి, వాళ్లకు ఫిర్యాదు చేస్తావా అంటూ సంఘం నాయకుల సమక్షంలోనే సీఐ హసీనాబాను ఆఫీస్ బాయ్ చెంపపై చెప్పుతో దాడి చేశారు. ఈ ఘటనను అక్కడి సిబ్బంది వీడియోతీసి సంబంధిత ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అప్పట్లో జిల్లా కేంద్రం నుంచి ఓ అధికారి విచారణకు వచ్చినా ఎలాంటి ప్రయోజనం లేకపోయినట్లు తెలిసింది. దీంతో ఆ వీడియోను సోషల్ మీడియాతో పెట్టడంతో పెద్ద దుమారం రేగింది. ఇదే క్రమంలో 'ఆంధ్రజ్యోతి'లోనూ 'వికటించిన వసూళ్ల పర్వం' శీర్షికన సీఐ వ్యవహారంపై ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే.

ఎక్సైజ్ కమిషనర్‌కు నివేదిక

కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐ హసీనాబాను అక్రమ వసూళ్లు, ఆఫీస్ బాయ్‌ని చెప్పుతో కొట్టడం తదితర పరిణామాలపై విచారిచేందుకు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డిని విచారణ అధికారిగా నియమించారు. దీంతో ఆయన కళ్యాణదుర్గం ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో జరిగిన పరిణామాలపై శనివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి దాకా సుదీర్ఘంగా విచారించినట్లు సమాచారం. క్షేత్ర స్థాయిలో జరిగిన పరిణామాలపై నివేదికలో పొందుపర్చినట్లు సమాచారం. ఇదే క్రమంలో ఆఫీస్ బాయ్ నాని ఆధార్ కార్డు ఆధారంగా 17 సంవత్సరాల వయస్సు మాత్రమే ఉన్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. కార్మిక చట్టం మేరకు 18 సంవత్సరాల్లోపు బాలలను పనిలో పెట్టుకోకూడదు. కళ్యాణదుర్గం ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో మైనర్‌ను ఏ రకంగా పనిలో పెట్టుకున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. డబ్బులు వసూళ్లు చేసుకొని రావాలని మైనర్‌పై ఒత్తిడితేవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్‌కు ఆదివారం సమగ్ర విచారణ నివేదిక పంపినట్లు తెలిసింది.

నివేదిక ఆధారంగా బదిలీ

విచారణ నివేదిక ఆధారంగా కళ్యాణదుర్గంలో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగకుండా ప్రాథమికంగా హసీనాబానుపై బదిలీవేటు వేశారు. ఉరవకొండ మొబైల్ పార్టీకి ఆమెను బదిలీ చేస్తూ తక్షణమే అక్కడ రిపోర్టు చేసుకోవాలని కమిషనర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే క్రమంలో విడపనకల్లు చెక్ పోస్టు సీఐ గురుప్రసాద్‌కు కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. విచారణ నివేదికల ఆధారంగా ఒకటి, రెండు రోజుల్లో ఎక్సైజ్ సీఐ హసీనాబానును సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు ఆ శాఖలో చర్చసాగుతోంది.

కలెక్టర్, ఎస్పీ సీరియస్

కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐ వ్యవహారాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ సీరియస్‌గా పరిగణించినట్లు సమాచారం. ఇంటెలిజెన్స్ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు క్షేత్ర స్థాయిలో సీఐ హసీనాబాను అక్రమ వసూళ్లు, ఆఫీస్ బాయ్ వ్యవహారంపై సమగ్ర నివేదికలను ఇప్పటికే ఎస్పీ కార్యాలయానికి అందజేసినట్లు తెలిసింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటన సమయంలో ఎక్సైజ్ సీఐ వ్యవహారం దుమారం కావడంతో కలెక్టర్ సీరియస్‌గా పరిగణనించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదికలు తెప్పించుకోవాలని జేసీని ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. కలెక్టర్, ఎస్పీ సీరియస్‌గా పరిగణించిన నేపథ్యంలో సీఐ వ్యవహారం సీఎం కార్యాలయం దాకా వెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అరెస్టు చేయాలి

కళ్యాణదుర్గం(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం ఎక్సైజ్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆఫీస్ బాయ్ నానిని చెప్పుతో కొట్టిన ఎక్సైజ్ సీఐ హసీనాబానుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని బాధితుడి తల్లి లిఖిత, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు, బీజేపీ నాయకులు విన్నవించారు. ఈ మేరకు ఆదివారం పట్టణ సీఐ యువరాజుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. తక్షణమే ఆమెపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు మల్లికార్జునస్వామి, రవి, శీన, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు మల్లారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ముప్పూరి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.


సీఐకి ఫిర్యాదు చేస్తున్న బాధితుడి తల్లి, బీజేపీ నాయకులు

యువకుడి దారుణహత్య

రాయదుర్గం, మే 18(ఆంధ్రజ్యోతి): టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వినోద్‌కుమార్(22) అనే యువకుడిని ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి దారుణంగా హత్య చేశారు. వివరాల్లోకి వెళితే.. రాయదుర్గం మండలం కొంతానపల్లికి చెందిన వినోద్‌కుమార్ శనివారం రాత్రి రాయదుర్గంలో జరిగిన రథోత్సవ వేడుకలను చూసుకుని సొంతూరుకు బయలుదేరాడు. తల్లి అంజినక్క, తండ్రి అంజినప్ప శనివారం అర్ధరాత్రి వరకు కొడుకు కోసం ఎదురు చూశారు. కానీ ఆదివారం ఉదయానికి కొంతానపల్లి గ్రామ సమీపంలో ఉన్న పొలంలో వినోద్‌కుమార్ శవంగా ప్రత్యక్షమయ్యాడు. విషయం తెలుసుకున్న సీఐ జయనాయక్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని కత్తితో గొంతును కోసి హతమార్చినట్లు పోలీసులు గుర్తించారు. వివాహేతర సంబంధం కోణంలో హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కళ్యాణదుర్గం డీఎస్పీ రవికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

- పాత విద్యార్థులకు చివరి అవకాశం
- 42 కేంద్రాల్లో ఏర్పాట్లు
- డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవిందునాయక్

అనంతపురం విద్య, మే 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి 28 వరకూ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవిందునాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత సిలబస్‌తో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు ఇదే చివరి అవకాశమని, ప్రతి విద్యార్థి పరీక్షలకు హాజరయ్యేలా హెచ్ఎంలు, తల్లిదండ్రులు చూడాలని పేర్కొన్నారు. జిల్లాలో 42 కేంద్రాల్లో రెగ్యులర్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకూ, ఓపెన్ పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకూ ఉంటాయన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 11,493 మంది, ఓపెన్ టెన్త్, ఇంటర్ 2,998 మంది పరీక్షలు రాస్తారని అన్నారు. గంట ముందుగానే కేంద్రాలకు రావాలని, చివరి నిమిషంలో కంగారుగా రాకుండా చూడాలని పేర్కొన్నారు.

హంద్రీనీవాపై ప్రజల మధ్యనే చర్చిద్దాం

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

గుంతకల్లుటౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): 'మా ఇంటికి మీరు రావటం.. మీ ఇంటికి నేను రావటం అనేది ఇది ఏమీ ఆస్తి విషయం కాదు.. ప్రజలకు సంబంధించిన సమస్య.. హంద్రీనీవా కాలువపై ప్రజల మధ్యనే చర్చిద్దాం' అని వైసీపీ ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడుసార్లు శంకుస్థాపన చేసి మూడు కిలోమీటర్లు కూడా హంద్రీనీవా కాలువ తీయలేని టీడీపీ నాయకులు మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హంద్రీనీవా కాలువ పనులు జరిగాయని గుర్తించుకోవాలన్నారు. ఉరవకొండలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన శిలాఫలకాలు ఉన్నాయని తెలిపారు. అక్కడే ఈనెల 21న వేదిక ఏర్పాటు చేసి, కాలువ శ్రీనివాసులు వారి నాయకులతో కలిసి రావాలన్నారు. సమావేశంలో నాయకులు నక్క భీమలింగప్ప, నాగేశ్వరరావు, తిమ్మప్ప, అబ్దుల్ బాసిద్, రాంబాబు, నూరి, శంకర్ పాల్గొన్నారు.

తాడిపత్రి పర్యటన
వాయిదా వేసుకోండి

ప్రస్తుత పరిస్థితుల్లో భద్రత ఇవ్వలేం
పెద్దారెడ్డికి ఎస్పీ సూచన

అనంతపురం క్రైం, మే 18(ఆంధ్రజ్యోతి): తాడిపత్రికి మరోసారి వెళ్లరు లెండి...ప్రస్తుతం జిల్లాలో జరిగిన సంఘటనలు, ఇతర బందోబస్తు నేపథ్యంలో భద్రత ఇవ్వలేమని ఎస్పీ జగదీష్ తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి స్పష్టం చేశారు. కోర్టు తీర్పు నేపథ్యంలో ఈనెలలో తొలుత పెద్దారెడ్డి జిల్లా ఎస్పీని కలిశారు. ఈనెల 9న సీఎం పర్యటన అనంతరం వెళ్లేలా సూచించారు. కానీ కుదర్లేదు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం ఈనెల 18వతేదీ తాడిపత్రికి వెళ్తామని పెద్దారెడ్డి ఎస్పీకి మెయిల్ ద్వారా విషయం తెలియజేశారు. ఇందుకు ఎస్పీ శనివారం మెయిల్ ద్వారానే సమాధానం ఇచ్చారు. మహానాడు, రాప్తాడు మండలంలో జరిగిన జంట హత్యలు, కుప్పంలో సీఎం బందోబస్తు, ఎంపీపీ ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం భద్రత కల్పించలేమని, కొన్ని రోజులు తాడిపత్రికి వెళ్లడం వాయిదా వేసుకోవాలని సూచించారు. త్వరలో ఎప్పుడు వెళ్లాలనే తేదీ చెబుతామని అందులో పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్



పడమటి గోపురం వద్ద ట్రాఫిక్ జామ్ (ఫైల్)

తిరువీధుల్లో ట్రాఫిక్ అస్తవ్యస్తం



హిందూపురం క్రాస్ వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్ (ఫైల్)

కదిరి, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరువీధులు శుక్ర, శని, ఆదివారాలు వచ్చాయంటే చాలు ట్రాఫిక్‌తో అస్తవ్యస్తంగా మారుతున్నాయి. హిందూపూర్ క్రాస్ నుంచి కోనేరు వరకు ట్రాఫిక్ స్తంభి స్తోంది. కనీసం అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. తిరువీధుల్లోనే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నివాసముండటంతో అక్కడికి వచ్చే ప్రజలు కూడా ఎక్కువగానే ఉంటారు. ఈ వీధులో ట్రాఫిక్‌ను నియంత్రించాల్సి పోలీస్ అధికారులు నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రనను గాలికొద్దిలేశారు. దీంతో గంటలకొద్ది ట్రాఫిక్ జాం అవుతోంది. ముఖ్యమంగా కర్ణాటక నుంచి వచ్చే భక్తులు తమ వాహనాలు ఎక్కడ పెట్టుకోవాలో సూచించడానికి ఇటు పోలీసులు కానీ, అటు ఆలయ సిబ్బంది కానీ చొరవ చూపడంలేదు. దీంతో తిరువీధుల్లో ఎక్కడబడితే అక్కడ వాహనాలు ఆపివేస్తున్నారు. చివరకు దేవళం బజారులో కూడా భక్తులు వెళ్లడానికి వీలులేకుండా పోతోంది. ఇప్పటికైనా పోలీసులు, దేవదాయ అధికారులు చర్యలు తీసుకుని, ట్రాఫిక్ ను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు కదిరి మహానాడు

కదిరి,మే 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ మహానాడును ఈనెల 20న నిర్వహిస్తున్నట్లు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణానికి సమీపంలోని పీవీఆర్ గ్రాండ్‌లో ఉదయం 9గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, మండల, నియోజవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

రేపు సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సు

పుట్టపర్తి, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యాఘర్ పథకంపై మంగళవారం స్థానిక సాయి ఆరామంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్ కో ఈఈ శివరాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు స్థానిక ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, ఇతర శాఖ అధికారులు హాజరవుతారన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తనకల్లు, మే18 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శోభాసువర్ణమ్మ ఆదివారం తెలిపారు. రాబోవు ఐదురోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, దీంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అన్నారు. ప్రాణ, ఆస్తి, పంట నష్టలు జరిగితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలన్నారు. కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటుందని, 79891 94386, 77998 92099, 94925 48697, 75699 46740 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

నేడు పల్లకీ సేవ

ధర్మవరం, మే 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కాశీవిశాలాక్షి సహిత శ్రీ కాశి విశ్వనాథ స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ఉయ్యాలోత్సవం పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కైప ద్వారకనాథ్ శర్మ తెలిపారు. సోమవారం రాత్రి ఏడు గంటలకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర

పుట్టపర్తిరూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమగొండపాలెంలో గంగమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలు, మండలాల భక్తులు వేలాది మంది ఇందులో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రత్యేక పూజలు చేయించారు.

పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయాలి

కదిరిఅర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాశాఖ చేపట్టే ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతలు ప్రక్రియ సక్రమంగా నిర్వహించి.. ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయాలని డెమోక్రెటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఫకృద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఉన్నతపాఠశాలలో తరగతికి 45మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉంటే రెండో సెక్షన్ మంజూరు చేయడం ద్వారా విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధకు అవకాశముంటుందన్నారు. ఇంగ్లీషు మీడియలో చదవలేనివారికి తెలుగు మీడియంలో చదువుకోవడానికి అవకాశం కల్పించడం ద్వారా డ్రాప్ అవుట్లను తగ్గించవచ్చన్నారు. సెంకెండరీ గ్రేడ్ టీచర్లను ఉద్యోగోన్నతులపై ఆయా పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా నియమించాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం

జాతీయ రహదారి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్

సమీపంలోనే నిల్వ ఉంటున్న వర్షపు నీరు

బత్తలపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడేకండ్ల వద్ద అనంతపురం నుంచి చెన్నై జాతీయ రహదారి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ రూపంలో ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడ కొత్తగా ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. జాతీయ రహదారికి రెండు అడుగుల దూరం కూడా లేదు. ఓ చిన్నపాటి వర్షం వచ్చినా.. ఆ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో రోడ్డుపై నీరు నిల్వ ఉంటోంది. ప్రతి వాహనం వెళ్లినప్పుడు.. ఆ నీరు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై పడుతోంది. దీంతో అది పేలే ప్రమాదముంది. కనీసం అక్కడ నీరు నిల్వ ఉండకుండా ఇటు రహదారి అధికారులు.. ఇటు ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోలేదు. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.



జాతీయ రహదారిపై నిల్వ ఉన్న వర్షపు నీరు.. పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

గ్రామాల్లో తాగునీటి కష్టాలు

● బోడినేపల్లిలో అడుగంటిన భూగర్భ జలాలు ● ఓరువాయిలో పైప్‌లైన్ లేక పాట్లు



బోడినేపల్లిలో నీటి కోసం వేచి ఉన్న మహిళలు



ఓరువాయికి అర కిలోమీటర్ దూరంలో ఉన్న తాగునీటి బోరు

నల్లచెరువు (కదిరి), మే 18(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు మండలంలోని ఓరువాయి, బోడినేపల్లి గ్రామస్థులు తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. బోడినేపల్లిలో పంచాయతీ నిధులతో వేసిన తాగునీటి బోరులో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో నీరు అరకొరగా వస్తున్నాయి. గ్రామంలో 80 కుటుంబాలు ఉంటున్నాయి. తాగునీటి కోసం కూలి పనులు వదిలేసి గంటల తరబడి తాగునీటి కోసం వేచి ఉండాల్సిన దుస్థితి ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇటీవల ప్రభుత్వం కొత్త బోరు వేయించినా.. దానిలో కూడా నీరు రాకపోవడంతో కష్టాలు తప్పడం లేదన్నారు.

● ఓరువాయిలో పైప్‌లైన్ లేక..

ఓరువాయి గ్రామంలో దాదాపు వంద కుటుంబాలున్నాయి. ఊరికి అర కిలోమీటర్ దూరంలో తా గునీటి బోరు ఉంది. దీంతో గ్రామస్థులు అంతదూరం వెళ్లి.. నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యేళ్లుగడిచినా .. ప్రభుత్వాలు మారినా కొళాయిలు ఏర్పాటు చేయలేదని ఓరువాయి గ్రామస్థులు వాపోతున్నారు.

కొళాయిలు ఏర్పాటు చేయాలి



తాగునీటి కోసం అరకిలోమీటర్ దూరం వెళ్లాలి. చాలా ఇబ్బందులు పడుతున్నాం. పిల్లలను వెంట తీసుకెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. యేళ్లతరబడి ఇలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, పాలకులు చొరవ తీసుకుని గ్రామంలో ఇళ్లవద్దకు పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలి.

- లక్ష్మీదేవి, ఓరువాయి

బోరు వేయించాలి



మా గ్రామం బోరులో నీరు అడుగంటిపోయాయి. నీరు అరకొరగా వస్తున్నాయి. ఓ బిందె నీళ్ల కోసం పనులు వదులుకుని బోరు వద్ద వేచి ఉంటున్నాం. అధికారులు స్పందించి మరో బోరు వేయించి.. ఈ సమస్యను పరిష్కరించాలి.

- జయచంద్రారెడ్డి, బోడినేపల్లి

నిధుల కొరత

నిధుల కొరతతో కొత్తగా బోర్లు.. పైపులైన్లు వేయించలేకపోతున్నాం. పంచాయతీకి నిధులు రాగానే తాగునీటి సమస్యలను పరిష్కరిస్తాం.

- కవి, ఆర్‌డబ్ల్యూఎస్, జేఈ

హెచ్‌ఐవీ బాధితులకు మనోధైర్యమిద్దాం





పుట్టపర్తి, ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పుట్టపర్తిరూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకుండా... వారిలో మనోధైర్యం నింపేలా కృషి చేయాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డాక్టర్ తిప్పయ్య పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం మే నెల మూడో ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ పేరుతో ఇలా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్, ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు జోత్స్న, మునిచంద్రిక సీహెచ్ఓ నగేష్ పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్ : స్థానిక ఆసుపత్రి నుంచి కళాజ్యోతి సర్కిల్ వరకు కొవ్వొత్తులతో ఆదివారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. ఇందులో పట్టణ వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, మెడికల్ ఆఫీసర్ చంద్రిక, ఎస్ఐ కేతన్న, ఐసీటీసీ కౌన్సిలర్ వనమాల, వైద్యసిబ్బంది టీబీ యూనిట్ బాషా, ల్యాబ్‌టెక్నీషియన్ భార్గవి, శక్తిమైత్రి మహిళాసంఘం ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణమ్మ, యువర్స్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



నాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమావేశం

అమడగూరు (కదిరి), మే 18(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని జౌకలకొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1982-87లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు సమారు నాలుగు దశాబ్దాల తర్వాత అదే పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. నాటి గురువులు నరసింహారెడ్డి, సాదిక్ వలీ తదితరులను ఘనంగా సన్మానించారు. తమవంతుగా పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కేవీ రమణ, అప్పిరెడ్డి, రామచంద్ర, వెంకటరమణ, రఘునాథ్, రమణ, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

యూటీఎఫ్ పాలసీ బాండ్ల పంపిణీ



పాలసీ బాండ్లను పంపిణీ చేస్తున్న నాయకులు

ధర్మవరం, మే 18(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ వెల్ఫేర్ పాలసీ బాండ్లను రాష్ట్ర కార్యదదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం పంపిణీ చేశారు. ఈ పాలసీలో భాగంగా యూటీఎఫ్ నాయకులు ఎవరైనా అనారోగ్య రీత్యా శస్త్ర చికిత్సలు అవసరం అయితే ఈ పాలసీ ద్వారా రూ.లక్ష నుంచి 2లక్షల వరకు తక్షణసాయం, అ లాగే ఒకవేళ మరణిస్తే రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మేరివర కుమారి, జిల్లా కార్యదర్శులు లతాదేవి, రామకృష్ణనాయక్, ధర్మవరం జోన్ నాయకులు ఆంజనేయులు, లక్ష్మయ్య, సకలచంద్రశేఖర్, పెద్దకోట్ల సురేశ్, రాంప్రసాద్, సాయిగణేశ్, రామాంజినేయులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు మార్చరూ..



దెబ్బతిన్న స్తంభం

అమడగూరు (కదిరి), మే 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన గాలీవానకు అమడగూరు మండలం మహమ్మదాబాద్ ఎస్సీ కాలనీలో నాలుగు విద్యుత్ స్తంభాల్లో చీలికలు ఏర్పడ్డాయి. అంతేకాకుండా అవి ఒరిగిపోవడంతో ఆ కాలనీ వాసులు అవి ఎప్పుడు కూలుతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహమ్మదాబాద్ నుంచి గొల్లపల్లికి వెళ్లే రహదారిలో గంగాధర్ ఇంటి వద్ద ఉన్న విద్యుత్ స్తంభం కింది భాగంలో చీలికలు వచ్చాయి. దీంతో ఆ స్తంభం విరిగిపోయి.. ఎక్కడ కూలుతుందోనని తాడుతో కట్టినట్లు ఆ కాలనీ వాసులు చెప్పారు. ఆ దెబ్బతిన్న స్తంభాలను మార్చాలని పది రోజులుగా విద్యుత్ అధికారులను పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై విద్యుత్ ఏఈ చంద్ర నాయక్‌ను వివరణ కోరగా.. విద్యుత్ స్తంభాల కోసం ప్రతిపాదనలు పంపామని, వచ్చిన వెంటనే స్తంభాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

చేనేత సమస్యలపై నిర్లక్ష్యం

ధర్మవరం, మే 18(ఆంధ్రజ్యోతి): చేతివృత్తిదారుల సమస్యల పరిష్కారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని చేతివృత్తిదారుల సమమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి విమర్శించారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ.. చేతివృత్తులపై అనేక మంది ఆధారపడి జీవిస్తున్నారని, వారి పిల్లల చదువు కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈనెల 27న చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లాకమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.





వెలగలని వీధి లైట్లు , కొక్కంటి కూడలిలో వెలగని నాలుగు స్తంభాల దీపాలు

వెలగని వీధిదీపాలు

● రెండు శాఖల మధ్య సమన్వయ లోపం
● రెండేళ్లయినా పరిష్కారం కాని సమస్య

తనకల్లు, మే 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంమైన తనకల్లు, మండలంలోని కొక్కంటిక్రాస్‌లో జాతీయ రహదారిలోని డివైడర్లపై ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగడం లేదు. కొక్కంటి క్రాస్‌లో కూడలిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నాలుగు స్తంభాల దీపాలూ వెలగడం లేదు. నాలుగేళ్ల క్రితం జాతీయ రహదారి విస్తరణ చేసి.. డివైడర్ల ఏర్పాటు.. వాటిపై వీధి దీపాలను ఏర్పాటు చేశారు. రెండేళ్ల పాటు ఆ దీపాలు బాగా పనిచేశాయి. ఆ తర్వాత అవి చెడిపోయాయి. దీంతో గ్రామస్థులు జాతీయ రహదారుల అధికారులకు ఫిర్యాదు చేస్తే.. తమకు సంబంధం లేదని తాము పంచాయతీలకు అప్పగించామని అంటున్నారు. పంచాయతీ అధికారులను అడిగితే తమకేమీ సంబంధం లేదని, తమకు ఎవరూ అప్పగించలేదని అంటున్నారు. ఇలా ఇరుశాఖల మధ్య సమన్వయం లోపం వల్ల రెండేళ్లుగా ఈ వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పాచిపట్టిన తాగునీటి ట్యాంకులు



ధర్మపురి గ్రామంలో పాచిపట్టిన తాగునీటి ట్యాంకు

ధర్మవరంరూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ట్యాం కులు పాచిపట్టి అపరిశుభ్రంగా మారాయి. ధర్మపురి, ఆకుతోటపల్లి, తుంపర్తి, కట్టకిందపల్లి, పోతుల నాగేపల్లి తదితర గ్రామాల్లో ట్యాంకులు పాచిపట్టాయి. ఆ నీటిలో పాచి వస్తోందని ఆయా గ్రామస్థులు వాపోతు న్నారు. నెలల తరబడి ట్యాంకులు శుభ్రం చేయకపోవడంతో ఆ ట్యాంకులు పాచిపట్టి దర్శన మిస్తున్నాయి. ప్రతినెలా పంచా య తీ అధికారులు ట్యాంకులు శుభ్రం చేయించి ట్యాంకుల చుట్టూ దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లాల్సి ఉంటుంది. అధికారులు మాత్రం అలా చేయకపోవడంతో పలుగ్రామాల్లో ట్యాంకులు పాచిపట్టాయి.. చుట్టూ అపరిశుభ్రత నెలకొంది.

క్రైం న్యూస్..

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కురుబ కల్యాణ మండపం వెనుక ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి బెంగుళూర్ నుంచి ధర్మవరానికి వచ్చే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి సుమారు 50 సంవత్సరాలు ఉంటాయని, మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలూ లేవని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 94412 38182 నెంబర్‌కు సమాచారం అందించాలని హిందూపురం రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

ధర్మవరంరూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్థసారథి నగర్‌కు చెందిన గాండ్లపర్తి చంద్రశేఖర్‌రెడ్డి (47) చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మరణించాడు. సెల్‌పాయింట్ యజమాని అయిన ఇతను ఇటీవల పట్టణంలో ఇంటి నిర్మాణం కోసం రూ.లక్షల్లో అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేక.. వడ్డీలు కట్టలేక జీవితంపై విరక్తి చెందిన అతను ఈనెల 17న ధర్మవరం మండలంలోని పోతుకుంట బృందావన కాలనీ సమీపంలో విషపుగుళికలు మింగాడు. కుటుంబసభ్యులు అపస్మారక స్థితిలో పడివున్న అతన్ని బెంగుళూరుకు తరలించారు. అక్కడ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. అతనికి భార్య భారతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన ఇస్కాన్ వేసవి శిక్షణ శిబిరం



శ్రీకృష్ణుడి లీలలపై చిన్నారుల నృత్య ప్రదర్శన



అలంకరణలో స్వామి,అమ్మవార్ల ప్రతిమలు

ధర్మవరంరూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డు సమీపంలోని ఇస్కాన్ మందిరంలో విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగి సింది. ఈ సందర్భంగా మందిరంలో పూరిజగన్నాథ్, బలరామ, సుభద్ర ప్రతిమలను అలంకరించి పూజలు చేశారు. అనంతరం శిక్షణ తీసుకున్న విద్యార్థులు దశ అవతార వేషధారణలు, భగవద్గీతశ్లోకాలు, బృందావన కృష్ణుడి నాటకం, హరినామసంకీర్తనలు, నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ టీఎంసీ సభ్యుడు శ్రీకృష్ణమాధవదాస్, స్థలదాత నల్లపేట శంకరయ్య, రామాంజినేయలు పాల్గొన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ భక్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, తండా వాసులు

ముదిగుబ్బ, మే 18(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి తమ ప్రాంతాలకు మూడు రోజులుగా విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయడంలేదని గుడ్డంపల్లి తండా, గుంజేపల్లి, పాతవూరు ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఆ సబ్‌స్టేషన్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో రోడ్డుపై ధర్నా చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ... మూడు రోజులుగా మూడు గ్రామాలకు విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడంలేదని, రాత్రి సమయాలల్లో చీకట్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. విద్యుత్ ఏడీ, డీఈ, ఏఈ, లైన్‌మెన్‌లు ఎవ్వరూ స్పందించడంలేదన్నారు. విద్యుత్ అప్ అండ్ డౌన్ అవుతుండటంతో ఎలక్ట్రికల్ పరికరాలు కాలిపోతున్నాయన్నారు. విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని, లేనిపక్షంలో మూడు గ్రామాల ప్రజలతో జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

జనసేన సభ్యత్వ కిట్ల పంపిణీ

కదిరిఅర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): జనసేన వలంటీర్లకు సభ్యత్వ నమోదు కిట్లను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్ ఆదివారం ఆర్అండ్‌బి బంగ్లాలో పంపిణీ చేశారు. వలంటీర్లు గ్రామస్థాయిలో సభ్యత్వ నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్లూమూన్ శివశంకర్, రవికుమార్, జయవర్ధన్, కేవీ రమణ, అంజిబాబు, కిన్నెర మహేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కిట్లు పంపిణీ చేస్తున్న భైరవప్రసాద్

ఈ దారిలో నడవాలంటే నరకమే..?

అమడగూరు (కదిరి), మే 18(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని కందుకురివాండ్లపల్లి నుంచి పొలాలకు వెళ్లే ఈ దారి చిన్నపాటి వానకు ఇలా బురదమయం అవుతోంది. ఈ గ్రామంలో దాదాపు 500 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామం నుంచి పొలాలకు, పవిత్రమైన అక్కదేవతల గుడికి వెళ్లడానికి ఇదొక్కటే మార్గం. పొలాలకు వెళ్లే వాహనాలు ఈ బురదలో చిక్కుకొంటున్నాయి. కేవలం 15 మీటర్ల మేర రోడ్డు వేస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై పాలకులు, అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



బురదగా మారిన కందుకురివాండ్లపల్లి రహదారి

భక్తిశ్రద్ధలతో వాసవీ జయంతి


పుష్పాలంకరణలో అమ్మవారు

చిలమత్తూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): వాసవీకన్యకాపరమేశ్వరీ జయంతి వేడుకలను దేమకేతేపల్లిలో ఆర్యవైశ్యులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని బెంగళూరు నుంచి తీసుకువచ్చి స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో కొలువుతీర్చారు. అక్కడ అమ్మవారికి విశేష పుష్పాకలంకరణ, అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాస దీక్షలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు చేశారు. మహామంగళహారతి తీసుకున్న తరువాత భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సిద్దేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అమరాపురం, మే 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన శ్రీసిద్దేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో ప్రారంభించి వివిధరకాల పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి సిద్దేశ్వరస్వామిని, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, విరుపాక్షి స్వాములకు వెండి కవచంతో ప్రత్యేకంగా అలంకరించారు. మహామంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సిద్దిలింగేశ్వరస్వామి, శివకుమార్‌స్వామి, రవిశంకర్‌స్వామి, మహేష్‌కుమార్, గౌతం, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకో

ఉషశ్రీచరణ్‌కు టీడీపీ నాయకుల హితవు


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): మంత్రి సవితపై చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని టీడీపీ నాయకులు మాజీ మంత్రి ఉషశ్రీచరణ్‌కు సూచించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్ని పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయి..? ఏ మేరకు అభివృద్ధి జరిగింది..? తదితర విషయాలు ప్రజలకు తెలుసన్నారు. గిర్రెపల్లి ప్రీకాట్ మిల్లు వద్ద మంత్రి సవిత నిర్లక్ష్యంతో పరిశ్రమ వెళ్లిపోయిందని నిరసన తెలపడాన్ని వారు తప్పుపట్టారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రీకాట్ మిల్లు నష్టాల్లో ఉన్న విషయం ప్రజలకు తెలుసన్నారు. కళ్యాణదుర్గం నుంచి పెనుకొండకు వచ్చావని, మరోచోటకు వెళ్లకుండానైనా చూసుకోవాలని హితవుపలికారు. సమావేశంలో మండల కన్వీనర్ శ్రీరాములు, రూరల్ కన్వీనర్ సిద్దయ్య, అధ్యక్షురాలు రమణమ్మ, చంద్రకాంతమ్మ, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, పోతన్న తదితర నాయకులు పాల్గొన్నారు.

గతాన్ని నెమరు వేసుకో

పరిగి, మే 18(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఉషశ్రీ వైసీపీ పాలనలోని విషయాలను నెమరువేసుకోవాలని టీడీపీ జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. ప్రీకాట్ మిల్లు వద్ద నిరసన తెలపడాన్ని తప్పుపట్టారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఎన్ని పరిశ్రమలు వచ్చాయో ప్రజలకు తెలుసన్నారు. వైసీపీ నాయకుల్లా పరిశ్రమలను తరమికొట్టలేదన్నారు. చర్చకు వస్తే తాము సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కళ్యాణదుర్గంలో మీరు చేసిన అరాచకాలు ప్రజలకు తెలుసన్నారు. ఇప్పటికైనా బురదచల్లటాన్ని మానుకోవాలని హితవుపలికారు.

నేడు వాల్మీకి ఆలయ పునఃప్రతిష్ఠ


పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, మే18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు రోడ్డులో వెలసిన వాల్మీకి దేవాలయ పునఃప్రతిష్ఠ సోమవారం జరుగనుంది. ఇందులో భాగంగా ఆదివారం గణపతిపూజ, గంగపూజ, గోపూజ, యాగశాలప్రవేశం, అఖండ దీప ప్రజ్వలన కార్యక్రమాలు ఆదివారం జరిగాయి. రాత్రి గర్తశోధన, యంత్రస్థాపన, అష్టబంధన సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం వేద పారాయణం, యాగశాలార్చనలతో ప్రారంభించి రాత్రికి స్వామివారి నేత్రోన్మిలన, ప్రాణప్రతిష్ఠ, జీవకళాన్యాసం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం జరుగనుంది. ఆదివారం జరిగిన పూజల్లో మున్సిపల్ చైర్మన్ రమేష్, వాల్మీకి కులపెద్దలు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంతో లాభాలు

నెలకు రూ.లక్షకుపైగా ఆర్జన... వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతున్న యువరైతులు


పొట్టేళ్ల పెంపకం కోసం నిర్మించిన షెడ్లు

సోమందేపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామ రైతులు సరికొత్త ఆలోచనలతో ముందుకెళ్తున్నారు. పాత సంప్రదాయ వ్యవసాయ పద్ధతికి స్వస్తిచెప్పి వినూత్న ఆలోచనతో సాగుతున్నారు. ఏటా అనావృష్టి, అతివృష్టిలతో అప్పులపాలై విసిగి వేసారి ఉన్న ఊరిలో తమకున్న పొలంలోనే సరికొత్త ఆలోచనలతో ప్రయోగాలు చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. గొర్రెల పెంపకాన్ని చేపట్టి లక్షలు సంపాదిస్తున్నారు. కొత్తపల్లి గ్రామంలో లక్షలు వెచ్చించి షెడ్లు ఏర్పాటుచేసి అందులో నాటిరకం, సింగవరం రకానికి చెందిన పొట్టెలు పిల్లలను తెచ్చి మేపుతూ లాభాలు గడుస్తున్నారు. నాటిరకం పొట్టేళ్ల పిల్లలను రూ.8వేల నుంచి రూ.9వేలు ఒక్కొక్కటి కొనుగోలు చేస్తున్నారు. కొత్తచెరువు, గోరంట్ల, పావగడ ప్రాంతాల్లో జరిగే సంతల్లో వాటిని తెస్తున్నారు. మరికొందరుచుట్టుపక్కల ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు. నెల నుంచి మూడు నెలల వరకు మేపి తిరిగి మార్కెట్‌లో విక్రయిస్తుండటంతో ఒక్కో గొర్రెపై రూ.వెయ్యి నుంచి రూ.2వేలు లాభాలు గడిస్తున్నారు. రైతు వెంకటేశులు తనకున్న ఎకరంన్నర పొలంలో 32 గొర్రె పిల్లలు, పశువుల కోసం రూ.5లక్షలు వెచ్చించి షెడ్డును నిర్మించాడు. పాడిపశువులతో పాలసేకరణ ద్వారా, పొట్టేలు విక్రయించడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందుతున్నాడు. అదేవిధంగా మల్లప్ప ఎకరన్నర పొలంలో ఇటీవల నూతనంగా షెడ్డునిర్మించి 28 గొర్రెపిల్లలు, 11 పాడి పశువులను పోషిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. మల్లికార్జున రూ.15లక్షలు వెచ్చించి ఏడాదిన్నర క్రితం గొర్రె పిల్లల పెంపకం చేపట్టాడు. 230 గొర్రె పిల్లలను రూ.25లక్షలతో కొనుగోలుచేసి మేపుతున్నాడు. నెల నుంచి రెండు నెలల వ్యవధిలో రూ.2లక్షలకుపైగా సంపాదిస్తున్నాడు. కర్ణాటక సింగూర్ రకం, నాటిరకం పొట్టేళ్లను మేపుతున్నాడు. అదేవిధంగా చంద్ర రూ.15లక్షలు చొప్పున రెండు షెడ్లు నిర్మించి 250పొట్టేలు పిల్లలను మూడు నెలలుగా మేపుతున్నాడు. కొనుగోలుదారులు చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా బెంగళూరు, గుంటూరు ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తున్నాడని తెలిపాడు. సంప్రదాయ పంటలతో వరుస నష్టాలు వచ్చాయని విసుగుచెంది ఉన్నఊరు, కన్నతల్లిదండ్రులను వదిలి వలస వెళ్లకుండా తమకున్న పొలంలోనే స్నేహితుల సహాయంతో పొట్టేళ్ల పెంపకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కర్ణాటక ప్రాంతంలో ఉన్న తమ స్నేహితులు ఈ వ్యాపారం చేస్తుండటంతో అక్కడకు వెళ్లి పరిశీలించి రెండేళ్ల క్రితం ఇక్కడ మొదలుపెట్టామన్నారు. ప్రారంభంలో అనుభవంలేని కారణంగా నష్టాలు వచ్చాయన్నారు. కొత్తపల్లిలో ప్రస్తుతం నాలుగు దాకా పొట్టేళ్ల పెంపకం షెడ్లుఉన్నాయని, మండలంలో రైతులు తమను చూసి వారు కూడా ఈ వ్యాపారాన్ని చేపట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు.


షెడ్డులో గొర్రె పిల్లలు

ఒకరిని చూసి మరొకరు..

మొదట్లో యువరైతు చంద్ర కర్ణాటక నుంచి తమ స్నేహితుడితో ప్రేరణ పొంది తన స్వగ్రామంలో కొత్తపల్లిలో రూ.50లక్షలు వెచ్చించి ప్రయోగాత్మకంగా పొట్టేళ్ల పెంపకాన్ని ప్రారంభించాడు. ఈ వ్యాపారం విజయవంతం కావడంతో అతడిని చూసి మరికొందరు రైతులు ముందుకొచ్చి పొట్టేళ్ల పెంపకం వ్యాపారాన్ని మొదలు పెట్టారు.

లాభసాటి వ్యాపారం

తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు సంపాదించడానికి అనువైన వ్యాపారం పొట్టేళ్ల వ్యాపారం. మొదట్లో షెడ్ల నిర్మాణం, పొట్టేళ్ల కొనుగోలుకు పెట్టుబడి ఎక్కువైనా తరువాత కాలంలో నెలకు లక్షల్లో సంపాదించే అవకాశం వ్యాపారంలో ఉంది. నెల నుంచి మూడు నెలలపాటు పిల్లలను తెచ్చి పోషిస్తే ఫీడింగ్, మందుల ఖర్చులు, కేర్‌టేకర్స్‌కు ఇచ్చే జీతం మొదలుకుని అన్ని ఖర్చులు రూ.50వేలు పోను నెలకు రూ.1.5లక్ష లాభం పొందవచ్చు.



పొట్టేళ్ల పెంపకంలో లాభాలు

ఏడాదిన్నర క్రితం పొట్టేళ్ల పెంపకం ప్రారంభించాను. రూ.5లక్షలు షెడ్డుకు, రూ.25లక్షలు పెట్టి పొట్టేలు పిల్లలను కొనుగోలు చేశాను. ప్రస్తుతం నెలకు రూ.లక్ష నుంచి రూ.2లక్షల ఆదాయం వస్తోంది. ఖర్చులుపోను రూ.1.5లక్షలు ఆదాయం వస్తోంది.

-మల్లికార్జున, యువరైతు, కొత్తపల్లి

స్నేహితుడి సాయంతో పొట్టేళ్ల వ్యాపారం

నాకున్న ఐదెకరాల్లో రెండు నెలల క్రితం కర్ణాటకలో పొట్టేళ్ల పెంపకం చేపట్టిన స్నేహితుడి ద్వారా వ్యాపారం గురించి తెలుసుకుని రెండు షెడ్లు నిర్మించి ప్రారంభించాను. కొత్తలో అనుభవంలేక కొంతమేర నష్టాలు వచ్చాయి. ప్రస్తుతం లాభాలు వస్తున్నాయి. మండలంలో చుట్టుపక్కల గ్రామాలవారు, రైతులు, పొట్టేళ్లను కొని తీసుకెళ్తున్నారు. ఖర్చులు పోను రూ.2లక్షల ఆదాయం వస్తోంది. ప్రభుత్వం షెడ్డు నిర్మాణానికి సబ్సిడీ రుణాలను అందిస్తే మరింత మంది ఈ వ్యాపారంలోకి వచ్చే అవకాశం ఉంది.

- చంద్ర, యువ రైతు కొత్తపల్లి



ఘనంగా స్వామివారి కల్యాణోత్సవం


కల్యాణోత్సవం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ

పెనుకొండ, మే 18(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదవారం యాగశాల ప్రవేశం, స్వస్తివాచకం, కలశారాధన, నవ కుంబరాదన, నిత్యహోమం, బలిహరణ, ప్రాకారోత్సవం మహామంగళహారతి తీర్థప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం 6గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంబ వైభవంగా నిర్వహించారు. అనంతరం గరుడోత్సవాన్ని ఆగమికులు రాజీవ్‌చార్యులు, మదుసుదనాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణాచార్యులు నిర్వహించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ సహకారంతో అన్నమాచార్య కీర్తనలు, హరికథ కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి'

పెనుకొండ, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సాహితీగగన్మహల్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మొక్కల పెంపకంలో భాగంగా పెనుకొండలోని మారుతికాలనీలో వెంకటరెడ్డిపల్లి వరకు విస్తరించి ఉన్న బోడికొండలో విత్తనంనాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

పురంలో క్యాండిల్ లైట్ డే



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎయిడ్స్‌నివారణ సంస్థ సహకారంతో ఆదివారం క్యాండిల్‌లైట్ డేని నిర్వహించారు. ప్రతిఏడాది మే మూడవ ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని మెడికల్ ఆఫీసర్ అరుణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ బాధితులపట్ల వివక్ష తగదన్నారు. కార్యక్రమంలో చైతన్యసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ శిబిరానికి పురం విద్యార్థిని

హిందూపురం, మే 18(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత శిబిరానికి పట్టణానికి చెందిన మహిళా ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థిని స్వాతిబాయి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రగతి తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని బెల్గావిలో ఉన్న రాణిచెన్నమ్మ విశ్వవిద్యాలయంలో ఈనెల 19నుంచి 24వరకు జరిగే సదస్సుకు స్వాతిబాయి వెళ్లనున్నారని తెలిపారు. భారత ప్రభుత్వ యువజనశాఖ, కేంద్రమంతిత్వశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ సమైక్యత శిబిరంలో రాష్ట్రం తరుపున పది మంది ఎంపికకాగా అందులో హిందూపురం విద్యార్థిని ఉండటం అభినందనీయమన్నారు. ఐదు భాషల్లో అనర్గళంగా మాట్లాడే స్వాతిబాయి రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలు యువత లో ఉండాల్సిన సేవాదృక్పథంపై వివరించనున్నారు.



విద్యార్థినికి ఎంపిక పత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రగతి

శ్మశానవాటికలో పరిశుభ్రత పనులు

చిలమత్తూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ఆ నలుగురు సేవాట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం చిలమత్తూరు గ్రామ స్మశానవాటికలో పరిశుభ్రత పనులు నిర్వహించారు. ట్రస్టు సభ్యులు రమణ, సోమశేఖర్ మాట్లాడుతూ అపరిశుభ్రత నెలకొందని బాగుచేసి సౌకర్యంగా ఏర్పాటుచేయాలని భావించామన్నారు. అందులో భాగంగా ఆ నలుగురు సేవా ట్రస్టు ఏర్పాటు చేసి పరిశుభ్రత పనులు చేపడుతున్నామన్నారు.

పరిశుభ్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీఐ నాగేష్‌బాబు

మడకశిర టౌన్, మే18(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛదివస్‌లో భాగంగా ఆదివారం మడకశిర సర్కిల్ కార్యాలయం అవరణంలో సీఐ నాగేష్‌బాబు పట్టణ వాసులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సబ్‌రిజిస్ట్రార్ నరసింహమూర్తి, సిబ్బందితో అవగాహన కల్పించి స్టేషన్ ఆవరణలో వర్షపు నీరు నిల్వ అయ్యేలా ఇంకుడు గుంతలు తీశారు, అదేవిధంగా పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు.

అధ్వానంగా రోడ్డు


బురదమయంగా మారిన ఆలయ రోడ్డు

సోమందేపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగినాయనిచెరువు తండా గ్రామంలో మారెమ్మ ఆలయానికి వెళ్లే దారి అధ్వానంగా ఉందని స్థానికులు అంటున్నారు. పల్లె పండుగలో భాగంగా అన్ని పంచాయతీల్లో మౌలిక వసతులు, రోడ్లు, వీధిదీపాలు, పారిశుధ్య పనులు వందశాతం పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించినా కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంవల్ల ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు శాశ్వత పరిష్కారాన్ని చొరవ చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అన్నదానం

పెనుకొండ, మే 18(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత అన్నదానం చేశారు. స్థానిక అయ్యప్పస్వామి దేవాలయం వద్ద ఆదివారం సంతకు వచ్చిన వారికి దాదాపు 200మందికి అన్నం ప్యాకెట్లు తాగునీటిని అందించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

గుడిబండ, మే 18(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు పేర్కొన్నారు. మండలంలోని హిరేతుర్పి గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, జడ్పీటీసీ భూతరాజు, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, బూతన్న, మహాలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

అమరాపురం, మే 18(ఆంధ్రజ్యోతి): మినీ మహానాడును విజయవంతం చేయాలని మండల కన్వీనర్ గణేష్, ఎస్సీసెల్ అధ్యక్షులు జయకుమార్ కోరారు. ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 10గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. టీడీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, కార్యదర్శులు, జడ్పీటీసీలు, క్లస్టర్‌మెంబర్లు, సర్పంచులు, ఎంపీపీ, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గుడిబండ, (ఆంధ్రజ్యోతి): మినీ మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్య

మడకశిర టౌన్, మే18(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో మంచి ప్రతిభ కనబరచి 585 మార్కులుపై సాధించిన విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ విద్య అందించనున్నట్లు శ్రద్ధఇన్స్టిట్స్ జూనియర్ కళాశాల చైర్మన్ రాధాకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు జేఈఈ, నీట్, ఎంసెట్‌కు సంబంధించి కోచింగ్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. మడకశిర నియోజకవర్గంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తు చేసుకోండి

అగళి, మే 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీపీ గుప్తా కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రఘురాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు ఒక పోస్టు ఎంఎ, కామర్స్ రెండు పోస్టులు ఎంకాం విద్యార్హత ఉండాలన్నారు. సివిక్స్ ఒక పోస్టు ఎంఏ ఫిజిక్స్, కెమిస్ట్రి, మ్యాథమిటిక్స్, ఒక క్లర్క్, బీకాం, బీఎస్సీ కంప్యూటర్స్ విద్యార్హత ఉండాలన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత సర్టిఫికెట్లతో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

కార్యవర్గం ఎంపిక

పెనుకొండ, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అఫీషియల్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కోనాపురం కేశవయ్య, కార్యదర్శిగా మెహర్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా కురుబ నంజుండ, కార్యవర్గ సభ్యులుగా నాగలూరునంజప్ప, నారాయణస్వామి, నబీరసూల్, మల్లికార్జున, రామకృష్ణానాయక్, రఘువీరచౌదరి ఎంపికయ్యారు.


విరగ్గాసిన మామిడి కాయలు

ఆశాజనకంగా మామిడి పంట

ఉద్యానశాఖ ఏడీ రాఘవేంద్రగౌడ్

పావగడ, మే18(ఆంధ్రజ్యోతి): మామిడి పంటకు ఈ యేడాది ఆశించినంత పంటలు చేతికి రావడంతో రైతు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఉద్యానశాఖ ఏడీ రామవేంద్రగౌడ్ తెలిపారు. తాలూకాలోని నిడిగల్ హోబళిలో 523హెక్టార్లు, వైఎన్‌హొసకోట 465, కసుబాలో 439, నాగలమడక హోబళిలో 165హెక్టార్లలో పంటను సాగుచేయడం జరిగిందన్నారు. పంట దిగుబడి ఈఏడు ఆశాజనకంగా ఉందన్నారు. 11,250టన్నుల మామిడికాయలు చేతికొచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. గడిచిన సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు మామిడి చెట్లకు తేమశాతం బాగా అందడంతో ఊత దశలోనే 70శాతం దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం అన్నిచోట్లా పంట దిగుబడి అధికంగా వస్తోందన్నారు.

గోకులం షెడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

అగళి, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలపల్లి గ్రామంలో గొర్రెల కాపరి తిప్పేస్వామి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.40లక్షతో గోకులం షెడ్డు నిర్మించారు. దీనిని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు పేదల పక్షపాతి అని అన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా సీఎం చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్, నాయకులు నరసింహప్ప, జయన్న, మల్లికార్జున, శ్రీనివాస్, వన్నేష్ తదితరులు పాల్గొన్నారు.


గోకులం షెడ్డు ప్రారంభోత్సవంలో ఎంఎస్ రాజు, తిప్పేస్వామి